# ఈ నిర్ణయం మీరే చెప్పండి

"కంగ్రాచ్యులేషన్స్" అంటూ స్నేహితుల, శ్రేయోభిలాషుల టెలిఫోన్లూ, ఉత్తరాలూ అందుకుంటూ పన్లన్నీ పూర్తి చేసుకునేటప్పటికి గడియారం ఏడు గంటలు కొట్టింది. గది బయటికొచ్చేసరికి, రాముడు బల్లమీదే కూర్చుని నిద్ర పోతున్నాడు.

''రాముడూ!'' పిలిచింది శమంత.

''అమ్మా!'' అంటూ ఉలిక్కిపడ్డట్టుగా లేచినుంచున్నాడు రాముడు.

''డ్రైవర్‌కి కారు తెమ్మని చెప్పు రూంకి తాళం వేసేయ్.'' ముందుకు నడుస్తూ అంది శమంత. రాముడు పరుగులాంటి నడకతో వెళ్ళి "ఖాజా!" అంటూ కేక పెట్టాడు మరుక్షణంలో ఐరావతంలాగా ధగాధగా మెరిసే తెల్లటి ఎంబాసిడరు కారు గేటులోంచి దూసుకొచ్చింది. ఖాజా కారుదిగి వెనక డోరు తెరిచాడు. శమంత కార్లో కూర్చోగానే కారు బంజారా హిల్స్ వైపు వెళ్ళి పోయింది.

శమంత ఆలోచనలు మర్నాడు జరగబోయే కార్యక్రమాన్ని గురించి ముసురుకున్నాయి.

ఉత్తమ ప్రిన్సిపాలుగా తనకి బంగారు పతకమూ, వెయ్యి రూపాయలూ, ప్రశంసాపత్రమూ లభించపోతున్నాయి. చేతిలోని అభినందనల కార్డూ, ఉత్తరాలూ మనసుని గిలిగింతలు పెడుతున్నా, గజిబిజి ఆలోచనలు

గతంలోకి తోసేస్తున్నాయి. ఆ తోపును తట్టుకోలేని శమంత ఊపిరందనట్టుగా ఉక్కిరిబిక్కిరవుతోంది. గొంతు తడారిపోయినట్టూ, కళ్ళు చీకట్లు కమ్ముతున్నట్టూ అనిపించింది. కారు రెక్కలువిప్పుకున్న మయూరిలా వచ్చి ఎంతో ఆనందంగా, అధునాతనంగా, విశాలంగావున్న ఆ భవంతి ముందు ఆగింది. విరగబూసిన మరగబూసిన మందారాలు ఉదయాన్నే విచ్చుకుని నేలరాలి తెల్లనిబట్టమీద నారింజరంగు చుక్కలు అద్దినట్టు అగుపిస్తున్న పారిజాతాలూ, రమణీయమైన రంగు రంగుల గులాబీలూ, రకరకాల క్రోటన్లూ పిల్లగాలుల తాకిడికి తాళం వేసి నర్తిస్తున్నట్టు ఊగుతున్నాయి. కారాపి ఖాజా గబుక్కున దిగి శమంతవైపు డోరు తెరిచాడు మిలటరీ సెల్యూటులా సెల్యూట్లు కొట్టి, వాచ్‌మన్ గేటు తెరిచాడు. అందంగా అమర్చిన వరండాలోకి వెళ్ళి పక్కగావున్న మేడమెట్లెక్కి తన గదిలోకి వెళ్ళిపోయింది శమంత.

వెనకాలే వచ్చిన ఖాజా "కారు షెడ్డులో పెట్టెయ్యనా, ఎక్కడికైనా వెళ్ళాలా అమ్మా" అన్నాడు స్వచ్ఛమైన తెలుగులో. విజయవాడ వాస్తవ్యుడు ఖాజా. అందుకే అచ్చ తెలుగువాడిలా మాట్లాడుతాడు తెలుగు. 'కాజారావ్' అంటుంది శమంత అప్పుడప్పుడు వాణ్ణి నవ్వుతూ. "షెడ్డులో పెట్టెయ్! ఎక్కడికీ వెళ్ళే పనిలేదు. రేపు పొద్దున్నే ఏడింటికల్లా వచ్చెయ్" అంది, హ్యాండు బ్యాగు టేబిల్ మీద పెడుతూ.

ఏదో అవ్యక్తమైన బాధ ఆమెని అశక్తురాలిని చేస్తోంది. మెదడులోని రక్తనాళాలు చిట్లుతాయేమోనన్నంత ఇదిగా, తలబద్దలైపోతోంది.

"అమ్మగారూ! కాఫీ తెమ్మంటారా?" అడిగాడు గోవిందం.

"ఊ....దాంతోపాటు ఒక తలనొప్పి టాబ్‌లెట్‌కూడా తెచ్చిపెట్టు."

"ఈ మధ్య ఈ గోలీలు శానా ఎక్కువగా ఏసుకుంటున్నారమ్మా! మంచిదికాదు. ఇప్పుడు కొంచెం వేడి వేడిగా కాఫీతాగి, తానం సేసొచ్చి పెందరాడే బోంచేసి పడుకోండి. అలసట మీదో, ఆకలి మీదో వచ్చుంటుంది! తలనొప్పి. మీ ఆకలి మీకు తెలీదు" అన్నాడు గోవిందం.

గోవిందం చాలా ఏళ్ళనుంచి ఆ యింట్లో వంట పని చేస్తున్నాడు. ఇంచుమించు శమంత చిన్నతనం నుంచి. అందుకనే అప్పుడప్పుడు నౌకరులా కాక, తండ్రిలా అధికారంతో మాట్లాడుతాడు.

"ఊ....సర్లే. కాఫీ పట్రా" అంది చిరాగ్గా

కాన్వెంట్లో కాఫీ కప్పుతో తిరిగొచ్చాడు గోవిందం. కాఫీ తాగడం, స్నానం చెయ్యడం, భోంచెయ్యడం అంతా యాంత్రికంగా జరిగిపోయింది.

శారీరకంగా, మానసికంగా, బాగా అలిసిపోయినప్పుడు నిద్దర పట్టక పోతే, అంతకన్నా శాపం మరోటుండదు. ఊరు ఊరంతా నిశ్శబ్దంగా వుంది. చిక్కగా అలుముకున్న చీకటి వికృతరూపం తప్ప మరేమీ కనిపించడంలేదు కిటికీలోంచి. గుండెనిండా నిండిన ఏదో దిగులు వికృతాకారం ధరించి శమంతని నిద్రపోనివ్వడం లేదు. గడియారం నిశిరాత్రిని గుర్తుచేస్తూ రెండు గంటలు కొట్టింది. ఇక మంచం మీద ఉండలేక, చీకటిని భరించలేక లేచి లైటు వేసింది. మంచానికెదురుగా వున్న అద్దాల బీరువాలోని కప్పులూ, షీల్డ్సూ, మెడల్సూ తనని చూసి నవ్వుతున్నట్టున్నాయి.

"నాట్యమయూరి శమంత", "కళా సరస్వతి శమంత"లాంటి బిరుదులను పొందుగుకున్న మెమెంటోలు తనని ఎగతాళి చేస్తున్నట్టున్నాయి. ఉద్రేకం పొంగుకొచ్చి, ఆ బీరువాని బద్దలు కొట్టాలనిపించింది. వాటికేసి చూడకుండా, ఆవేశాన్ని అణచుకుంటూ, "ఈ గోవిందానికి బుద్ధిలేదు. ఎన్నిసార్లు వాటిని తీసి కనబడకుండా దాచెయ్యమని చెప్పినా వినకుండా నా గదిలో నా మంచానికెదురుగ్గా పెట్టాడు" అని తిట్టుకుంటూ దీపాన్నార్పేసి, గుండెల్లోని మంటలని ఆర్పడానికి ప్రయత్నిస్తూ, మంచం మీద వాలిపోయింది. ఎంత ప్రయత్నించినా మనసు గతంలోకి వెళ్ళి జరిగిన కాలాన్నే గుర్తు చేస్తోంది. అచేతనంగా పడుకుని ఆలోచిస్తోంది శమంత.

ఆ రోజు తన జీవితంలో మరిచిపోలేని రోజు. తన జీవితాన్నే మార్చేసిన రోజు.

ఎన్ని రోజుల్లో ఎన్నిసార్లో అటువంటి సంఘటనలు జరిగినా ఆ రోజు మాత్రం ఏదో కొత్తదనం, కొత్త అనుభూతి, అనిర్వచనీయమైన అనుభవం.

"కళా సరస్వతి శమంత" అని రాసున్న చెక్కటి సరస్వతీ విగ్రహాన్ని ఆనాటి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ అవినాశ్ శమంత కందించాడు. అతని చూపులు ఆమెని గుచ్చేస్తున్నాయి. రెప్ప వాల్చకుండా చుట్టూవున్న మనుషుల్నీ, వాతావరణాన్నీ మర్చిపోయి ముగ్ధురాలై

అలా చూస్తుండిపోయాడు. జనంలోంచి చిన్నగా రణగొణధ్వనులూ ఈలలూ మొదలయ్యాయి. చిరునవ్వుతో "కంగ్రాచులేషన్స్" అన్నాడు. చక్రాల్లాంటి కళ్ళను మరింత పెద్దవిచేసి, సంతోషంతో "థాంక్స్" అంది తను. ఆ మరునాటి నుంచీ కాలేజీలో అందరూ ఏడిపించడం మొదాలెట్టారు "వరూధినీ ప్రవరాఖ్యు" లనీ "దుష్యంతుడు శకుంతల" అనీ "రోమియో జూలియట్" అనీ. ప్రేమోగీమో తెలీదుగాని, అవినాశ్ రూపు శమంత మదిలో నిలిచిపోయింది.

ఒక రోజు సాయంత్రం శమంత ఇల్లు చేరుకునేసరికి, ఇల్లంతా కోలా హలంగా వుంది. "నిన్ను చూడ్డానికి పెళ్ళి వారొస్తున్నారు, తొందరగా తయారవ్వు" అని హడావిడి చేసింది పార్వతమ్మ.

"ఎవరమ్మా వాళ్ళు?" అంది చిరాగ్గా ఈ తతంగం అంతా ఇష్టంలేని శమంత. పైగా తన మనసులో అవినాశ్ మెదులుతున్నాడు.

"మంచి డాక్టరుట. పేరు తమాషాగా వుంది. మన తెలుగువాళ్ళ పేరులా లేదు. మొన్న మీ కాలేజీలో ఫంక్షన్ రోజున, అతనే నీకు ప్రైజిచ్చాట్టగా?"

ఆశ్చర్యంగా చూసింది తల్లికేసి.

"అన్నదమ్ములూ, అక్క చెల్లెళ్ళూ ఎవరూ లేరుట. తండ్రి కూడా పాపం, మొన్నీ మధ్యనే పోయాట్ట. ఒక్క తల్లీ తనే వుంటారట. బోలెడంత ఆస్తుందిట. పైగా అందగాడట. శామూ! అందం, ఐశ్వర్యం రెండూ, లక్ష్మి సరస్వతుల్లా ఒక్కచోట వుండవంటారు."

కానీ, "పో....అమ్మా....నేనింకా మెడిసిన్ పూర్తి చెయ్యలేదు. ఇంకా రెండేళ్ళు కావాలి. దాని తరువాత హౌస్ సర్జన్సీ వుంది. అప్పుడికిగాని డాక్టరుగా బోర్డు కట్టలేనుగా!" అంది. లోలోపల అవినాశ్‌తో పెళ్ళి తన కిష్టమే అయినా. పైకి తన అభిప్రాయం చెప్పకుండా.

"పెళ్ళయ్యాక పూర్తిచెయ్యి. చదువుకి మీపెళ్ళే అడ్డం కాదు ఈ రోజుల్లో" అంది ఆమె.

శమంత మాటాడలేదు.

శమంతని చూస్తే గలగల పారే సెలయేరూ, కిలకిల మనే పక్షులూ జ్ఞాపకం రాక తప్పదు. ఆమె ఎక్కడుంటే అక్కడ నవ్వులు పూస్తాయి. సంతోషం పరవశించి, నర్తిస్తుంది. విషాదం పటాపంచలైపోతుంది.

"అవినాశ్‌తో శమంత వివాహం రతీమన్మధుల వివాహంలా, సుభద్రార్జునుల కళ్యాణంలా, కన్నుల పండువుగా వుంటుందన్నారు" అందరూ....

పెళ్ళయిపోయింది. కోటిఊహాలు మనసును మీటుతూంటే అప్సరసలా, అపర సరస్వతిలా నృత్యకళా సరస్వతి శమంత అవినాశ్ ఇంట్లో అడుగు పెట్టింది తియ్యని తలంపులతో, పొంగే వలపులతో.

ఒక్క రోజునే ఆ యింటి వాతావరణం శమంతని భయకంపితురాలిని చేసింది. కలలన్నీ పేకమేడల్లా కుప్పకూలిపోయాయి. నాలుగు రోజుల్లో పరిస్థితంతా అర్థమయిపోయింది. అవినాశ్ తల్లి సుందరమ్మగారికి ఈ పెళ్ళి ఎంతమాత్రం ఇష్టంలేదని, మేనరికాన్ని, అంటే ఆమె తమ్ముడి కూతుర్ని అవినాశ్ చేసుకోనందుకు ఆమెకి శమంత అంటే ద్వేషమనీ తెలిసింది. అంతే కాదు, అవినాశ్ తల్లిగీసినగీటు దాటడు. ఆటువంటి అవినాశ్ పెళ్ళి విషయంలో తన మాట వినలేదని మండిపడుతోంది. ఆమె ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునేదాకా, ఏదో ఒక సాకు మీద తిట్లు, శాపనార్థాలూ పెడుతూనే వుంది ఆమె అయినా శమంత నోరు విప్పలేదు. అవినాశ్ పన్లన్నీ తనే చేసి పెడుతూ, శమంత మీద ఏదో ఒక చాడీ చెబుతూనే వస్తోంది. రాత్రిళ్ళు కూడా అవినాశ్ శమంతతో మాట్లాడడానికి వీలులేకుండా, అర్ధరాత్రి దాటేదాకా ఏవో కబుర్లు చెబుతూ ఆమె అవినాశ్ దగ్గరే పడుకుంటుంది. ఆమె వుండగా అవినాశ్ శమంతని కన్నెత్తి చూడడు. ఈమె దండకాన్ని ప్రతిరోజూ విని వినీ విసుగెత్తిన శమంత, సమాధానం చెప్పింది ఒకరోజు. మాటా మాటా పెరిగింది. దాంతో సుందరమ్మ కాళికాదేవిలా రెచ్చిపోయి, శమంత పెట్టే, బేడా అవతల పారేసింది.

అయినా ఆమె ఆవేశం చల్లారక, "నువ్వు గజ్జె కట్టి గెంతడానికే గాని, సంసారానికి పనికిరావు" అంటూ గజ్జెలని విసిరిపారేసింది. ఒక్కొక్క గజ్జె తెగి ఇల్లంతా చిందరవందరగా పడిపోయాయి శమంతకి వెర్రి ఆవేశం ముంచుకొచ్చింది తెగి పడిన గజ్జెలని చూస్తుంటే. కోపం, దుఃఖం పొంగుకొచ్చి కటువుగా అంది : "కళాహీనులకి కళలంటే ఏం తెలుస్తుంది? సంస్కారం లేని పశువులకి సరస్వతి మీద గౌరవం, మర్యాద ఎక్కడినుంచొస్తుంది?" అంది.

"ఒరేయ్! చూశావురా దీని పొగరు? నాకే ఎలా సమాధానం చెబుతుందో. నీ బతుకిలా అయిపోవడానికి కారణం, నీకే మత్తుమందు పెట్టిందో, దీని వల్లో పడ్డావు" అంటూ కళ్ళు తుడుచుకుంది.

"అడ్డదిడ్డంగా మాట్లాడితే ఎవరికైనా ఇటువంటి సమాధానాలే దొరుకుతాయి. మందు పెట్టడానికీ, మాయ చెయ్యడానికి నేనేమీ మంత్రగత్తెను కాను" అంది కింద వద్ద ఒక్కొక్క గజ్జెనీ ఏరుతూ.

"నోర్ముయ్" అంటూ రెచ్చిపోయిన పౌరుషంతో గొంతు చించుకుంటూ అమె.

"ఆ అవసరం నాకు లేదు."

చెంప చెళ్ళు మంది. అవినాశ్ అయిదు వేళ్ళూ శమంత బుగ్గల మీద అచ్చు వేసినట్టు పడ్డాయి. శమంతకి తల తిరిగినట్టనిపించింది. చెంపకి తగిలిన దెబ్బకి కాదు, అంతకు రెట్టింపు గుండెకు తగిలిన దెబ్బకి. ఏరిన గజ్జెలన్నీ మళ్ళీ కింద పడిపోయాయి. ఇదేనా అవినాశ్ సంస్కారం? తల్లి చుట్టూ పనివాడిలా కొంగుపుచ్చుకు తిరుగుతూ, గంగిరెద్దులా అమె చెప్పే ప్రతి మాటకీ మంచీ చెడూ ఆలోచించకుండా తలూపడమే కాకుండా, తన తప్పు ఏమీ లేకపోయినా తల్లిని ఏమీ అనలేక, తన మీద చెయ్యి చేసుకున్నందుకు, పైగా ఆడవాళ్ళ మీద చెయ్యి చేసుకున్న మగాడంటే తనకి పరమ అసహ్యం తల్లిని గౌరవించొచ్చు, ప్రేమించొచ్చు కానీ, ఆలోచన మాని అన్నింటికీ తలూపడం తల్లి మాటలు విని. తన చిన్నతనంలో పనిమనిషి మొగుడు వీరయ్య తల్లి మాటలు విని తాగొచ్చి పెళ్ళాన్ని బాదుతుంటే తను వెళ్ళి అడ్డుపడి "నీకు బుద్ధుందా లేదా, ఆడవాళ్ళని కొడతావా? తప్పుకదూ?" అంది. అనుకోని ఈ సంఘటనకి వాడు అమాంతం కాళ్ళమీద పడి "తప్పయిపోయిందమ్మాయి గారు! ఇంకెప్పుడూ ఇలా చెయ్యను" అంటూ క్షమాపణలు చెప్పుకున్నాడు. అప్పటినుంచీ వాడు పెళ్ళాన్ని కొట్టడం మానేశాడని అమ్మ చెప్పేది. ఆనాటి వీరయ్యకీ, ఈనాడు డాక్టర్ అవినాశ్‌కి ఏమీ తేడా కనిపించలేదు శమంతకి. కళ్ళల్లోంచి నీళ్ళు చెంపలమీదుగా జారుతుంటే కసిగా అతని వైపు చూసింది. ఆ చూపులు చదవగలిగితే "ఎడ్యుకేటెడ్ బ్రూట్" అని చెప్పొచ్చేమో! అవినాశ్‌కి బహుశా అర్థమయి వుంటుంది. తలదించుకున్నాడు. శమంత చిందరవందరగా పడున్న గజ్జెలన్నీ పోగు చేసుకుని తన సామాన్లన్నీ తీసుకుని ప్రయాణమయింది.

మామిడి తోరణాలింకా వాడక ముందే, పెళ్ళి బడలిక పూర్తిగా తీరక ముందే, మూటముల్లే పట్టుకుని శాశ్వతంగా తిరిగొచ్చిన శమంతని చూసి గుండె బాదుకున్నారు తల్లీ తండ్రి. శత విధాల శమంత తరపున క్షమాపణ చెప్పుకుని, ఆమె కాపురాన్ని నిలబెట్టడానికి ప్రయత్నించారు శమంత తల్లిదండ్రులు. కాని ఫలించలేదు. పైగా అవినాశ్ పై చదువుల కోసం అమెరికా వెళ్ళిపోయాడని తెలిసిననాడు శమంత ఇంటిలో పొయ్యి వెలగలేదు.

కాలం గడుస్తోంది. ఆకులు రాలి మోడుగా వున్న చెట్లు, చిగురుటాకులతో పచ్చగా నిగనిగలాడుతున్నాయి. ఆ సంవత్సరం మోడులాగా బోసిపోయిన శమంత పరీక్ష తప్పింది. చదువు మీద మనసు లగ్నం కావడంలేదు. బంధువుల సూటిపోటీ మాటలూ, తల్లిదండ్రుల కన్నీటి బాధలూ చూడలేకపోతోంది. చదువుకి స్వస్తి చెప్పి, నాట్యంలో చేరింది. తల్లీ తండ్రీ వద్దని వారిస్తున్నా వినక, ఆ గజ్జెలు ఘల్లు ఘల్లు మంటుంటే ఏదో ఆనందం, అనిర్వచనీయమైన తన్మయత్వం, అన్నీ మరిచిపోతుంది ఆ కాస్సేపూ.

ఆ రోజు.... జన్మలో మరచిపోలేని మరో రోజు. అవినాశ్ విడాకుల కాగితాలు పంపిస్తూ సంతకం పెట్టమని రాసిన ఉత్తరం. ఈ నాటికీ మరచి పోలేదు తను. సంతకం పెట్టొద్దని, తల్లీ తండ్రీ వారించారు.

"మనసులు విరిగాక, మమతలు మాసిపోయాక ఈ బంధం మాత్రం ఎందుకు మిగిలి వుండాలి?" అంటూ సంతకం పెట్టి పోస్టు చేసింది శమంత ఆ రోజు నుంచి మెళ్ళోని మంగళ సూత్రాన్ని కూడా తీసేసింది. "తెగించింది" అన్నారు కొందరు. "తెగతెంపులు చేసుకుంది చేతులారా" అన్నారు మరికొందరు. ఎన్ని రాత్రులు తను ఒంటరిగా ఏడ్చిందో ఎంతమందికి తెలుసు? నలుగురిలో ఏడవడం, సానుభూతి ఆశించడం ఆమెకి పరమ అసహ్యం. దాంతో తోటి ఆడవాళ్ళు కూడా అర్థం చేసుకోకుండా, శూలాల్లా మాటలు రువ్వేవారు. అందు కని ఒక విధంగా శమంతకి ఆడవాళ్ళంటే మరీ అసహ్యం పుట్టుకొచ్చింది. "ఎవరి బాధల్ని వారు వాళ్ళ గుండెలోనే దాచుకోవాలి" అంటుంది శమంత. అందుకే నలుగురు వున్నప్పుడు గలగలా నవ్వుతూ, 'అసలీమెకు కష్టాలంటూ ఉన్నాయా?' అనిపించేలా ప్రవర్తిస్తుంది. కానీ, ఆమె గుండెలో అగ్ని పర్వతాలు మండుతున్నాయనీ, ఎన్నో రాత్రులు ఆమె నిద్రాహారాలకు దూరమై దుఃఖాన్ని కౌగిలించుకుని గడుపుతూందనీ ఎవ్వరికీ తెలీదు. అర్థం చేసుకోరు. చివరికి

కోపం వచ్చినప్పుడు తల్లి కూడా "నీకు బొత్తిగా చింతలేదే" అనేది. శమంత నవ్వేసి ఊరుకునేది. కాలం గడుస్తోంది.

కొన్నాళ్ళకి శమంత ఒక కాన్వెంటు స్కూల్లో డాన్సు టీచరుగా చేరింది. అందరిలోకీ డ్రాయింగ్ టీచరు కిరణ్మయితో బాగా స్నేహం ఏర్పడింది శమంతకి. ఇద్దరూ కలిసి సినిమాలకి వెళ్ళేవారు. హోటళ్ళకి వెళ్ళేవారు. షాపింగులకీ, బజారుకీ వెళ్ళేవారు. కిరణ్మయీ వాళ్ళ అన్నయ్య రాజా కూడా అప్పుడప్పుడు వీళ్ళతో కలిసేవాడు. రాజా స్ఫురద్రూపి, మిత భాషి. శమంతకి రాజా అంటే తనకు తెలీకుండానే ఒక రకమైన ఇష్టం యేర్పడింది. అది ప్రేమని తెలుసుకుని, రాజాతో చెప్పాలనుకునేసరికి, అతని పెళ్ళివార్త గుండెని ముక్కలు చేసింది. జీవితంలో సర్వం పోగొట్టుకున్నదానిలా, కుప్పలా కూలి పోయింది. తన బ్రతుకేమిటో తనకి అర్థం కాలేదు తనని కోరుకుని చేసుకున్న అవినాశ్ కాదని వెళ్ళిపోయాడు రాజా తనకి దక్కలేదు. యేమిటి తనకీశాపం? ఎందుకు తనకీ దుఃఖం? కుమిలిపోయింది శమంత మోయలేని దుఃఖాన్ని గుండెల్లో దాచుకుని, ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఇంట్లో కూర్చుంటే మరీ అశాంతి పెరిగిపోయింది "ఉన్నట్టుండి ఎందుకు మానేశావమ్మా ఉద్యోగం?'' లాలించింది తల్లి.

''నాకు నచ్చలేదమ్మా! '

ఆశ్చర్యంగా చూసింది ఆమె. ''మరి?'' అంది.

"అదే ప్రదర్శనలిస్తాను. నాట్యంలోవున్న తృప్తి మరి దేన్లోనూ లేదమ్మా! చీకూ చింతా లేకుండా ఆడుకుంటూ, పాడుకుంటూ స్వేచ్ఛగా బతకాలని వుందమ్మా గజ్జెల గలగల నా గుండెలోని బరువును దింపేస్తుంది'' అంది తల్లికేసి నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తూ.

''పిచ్చిదానా! ఎగిరే పక్షి, ఆడే నెమలీ కూడా పిల్లల్ని కని, వాటిని చూసి మురిసిపోతాయి. నువ్వు జీవితంలో పెళ్ళి చేసుకుని స్థిరపడాలమ్మా! అప్పుడే దొరుకుతుంది శాంతి. నాట్యంలో కాదు. నాట్యం, సంగీతం - ఆ మాట కొస్తే ఏ కళైనా తాత్కాలికానందాన్నే కలగజేస్తుంది కానీ, శాశ్వతమైన తృప్తినీ, జీవితానికో అర్థాన్ని కలిగించలేవు '' కళ్ళు తుడుచుకుంటూ అంది తల్లి, ఇంకేం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలీక.

''అమ్మా! దయచేసి పెళ్ళి మాటెత్తకమ్మా!" అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయింది తను.

గజ్జెలన్నింటినీ కొత్త దారంలో గుచ్చింది. వాటిని చూసి పరవశించి పోయింది. నాట్య ప్రదర్శనలిస్తూ, తన్మయత్వాన్ని పొందుతోంది. ఏ పేపర్లో చూసినా శమంతని గురించి పొగడ్తలే శమంత మరింత పారవశ్యంతో నాట్యం చేస్తోంది. నాట్య సాధన, నాట్య ప్రదర్శన - ఆ ఆరాధనలో ఆమెకు మరే విషయం జ్ఞాపకం రావడంలేదు మరేమీ కోరుకోవడం లేదు.

ఒక ఋతువు తరువాత ఇంకో ఋతువు వచ్చినట్టు, ఒక రేయి తరువాత ఒక పగలు వచ్చినట్టు ప్రకృతిలోనే కాదు - జీవితానికీ మార్పు సహజమని. అడుగడుగునా ఏదో ఒక మార్పు ప్రతి జీవికి సంభవిస్తుంది. ఈ మార్పనేది లేకపోతే జీవితం బోరుకొట్టి ముప్పాతిక మంది ఆత్మహత్యలు చేసుకునేవారేమో, జీవించడమే విసుగనిపించి.

ఆ రోజున శమంత షాపింగ్‌కని బయలుదేరింది. హఠాత్తుగా కనిపించాడు రాఘవన్. "హల్లో బావున్నారా? మిమ్మల్ని ప్రత్యక్షంగా చూడకపోయినా, మీ పేరు ప్రతిరోజూ పేపర్లో చదువుతూ, మిమ్మల్ని పేపరుద్వారా చూస్తూనే వున్నాను" అన్నాడు నవ్వుతూ ఆప్యాయంగా పలకరిస్తూ.

"థాంక్స్!" అంది చిరునవ్వుతో శమంత.

''ఇప్పుడేం చేస్తున్నారు మీరు? ఐ మీన్ ఉద్యోగం!"

''ఏమీలేదు. నాట్యాన్నే వృత్తిగా తీసుకొన్నాను."

''సరస్వతీ వరపుత్రిక-కాదు, ప్రియ పుత్రిక మీరు.''

"మీకు కవిత్వం కూడా వచ్చన్నమాట!"

''భోజరాజును చూస్తే బొమ్మలకు కూడా కవిత్వం పుట్టుకొస్తుందట- అలాగే.''

''మా ఇంటికి రండోసారి'' అన్నాడు.

"ముందు మీరు రావాలి మా ఇంటికి.''

''అలాగే తప్పకుండా''

"మరి వస్తాను బై."

''బై....''రాఘవన్ స్కూటరు స్టార్టు చేసి వెళ్ళిపోయాడు.

రాఘవన్ అవినాశ్ స్నేహితుడు. అతని కోసం వచ్చినప్పుడు అయిదారు మార్లు చూడడం, మాట్లాడడం తటస్థించింది. ''అవినాశ్! యూ.... అర్....ఏ....లక్కీ.....ఫెలో....! నీ భార్య అపర సరస్వతి'' అనేవాడు రాఘవన్. మాతృభాష అరవం అయినప్పటికీ పుట్టి పెరగడం, చదువు సంధ్యలూ అన్నీ హైదరాబాదులోనే అవడంవల్ల తెలుగుని తెలుగువారిలాగానే ఒక్కొక్కప్పుడు వారికన్నా కూడా బాగా మాట్లాడతాడు. రాఘవన్‌ని చూడగానే అందగాడు అనలేంగానీ, ఆకర్షణీయుడు అనగలం. పెద్దకళ్ళు, కోలమొహం, నవ్వితే సొట్టలుపడే బుగ్గలు, నీటుగా దువ్విన క్రాపూ, చామనఛాయా - ఇవన్నీ కలిపి చూడగానే బుద్ధిమంతుడు అనిపించేలా వుంటాడు. రెండు రోజులు తిరక్కుండా రాఘవన్ శమంత ఇంటికొచ్చాడు. ఏవేవో కబుర్లు దొర్లిపోయాయి. గంటలు నిమిషాల్లా గడిచిపోయాయి. మరో రెండు రోజులు గడిచాక, మళ్ళీ వచ్చాడు. శమంతని రవీంద్రభారతిలో దింపి తనకేదో పనుండడం వల్ల వెళ్ళిపోయాడు. మరోసారి ప్రదర్శనకొచ్చి ప్రదర్శన అయిపోయాక ఇంటిదగ్గర దింపివెళ్ళాడు. ఇలా రెండురోజులకోసారల్లా, రాను రాను రోజుకి రెండుసార్లు రావడం, వచ్చినప్పుడల్లా గంటలు తరబడి కూర్చొని మాట్లాడడం శమంత తల్లిదండ్రులకంత నచ్చకపోయినా, శమంత నొచ్చుకుంటుందేమోనని ఊరుకున్నారు. ఒక్కరోజున అతను రాకపోతే శమంత ఎదురుచూసే స్థితికొచ్చింది. శమంత మనసులో రాఘవన్‌కుండే స్థానం ఒక మంచి స్నేహితుడిగా మాత్రమే. కాని రాఘవన్ మాత్రం, శమంతని మరో దృష్టితో జీవితంలో భాగస్వామిగా కోరుకుంటున్నాడు. ఈ మాట అతని నోట విన్నప్పుడు శమంత స్థంభించిపోయింది. అతనికి ఏ రకంగా సమాధానం చెప్పాలో అర్థంకాక పిచ్చిదానిలా అయిపోయింది. అతని కోరిక చాలా అసభ్యంగానూ, అన్యాయంగానూ అనిపించింది. ఎంత ఆలోచించినా అందుకు ఆమె మనసు అంగీకరించలేదు శమంత తిరస్కారణని భరించలేకపోయాడు రాఘవన్.

ఆమె తనని పెళ్ళిచేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానన్నాడు. నిద్రాహారాలు మాని శమంత వెంట పిచ్చివాడిలా తిరుగుతున్నాడు. మొదట్లో అతను ఆత్మహత్య చేసుకుంటానంటే నవ్వింది శమంత. ఆ పని ప్రేమలో

ఓడిపోయిన ఆడదేగాని, మగాడు చెయ్యడంది. "ఏం మగాడు మాత్రం మనిషి కాదా? మగాడికి మనసు లేదనుకోవడం, అతనికి కన్నీళ్ళు రావను కోవడం పొరపాటు శమంతా! అతనికీ కన్నీళ్ళు వస్తాయి. కాకపోతే ఆడది ఏడ్చినంత స్వేచ్ఛగా మగాడు ఏడవలేడు. కారణం తనమీద ఆధారపడ్డవారిని ఆదుకునే స్థితిలోవున్న పురుషుడు ఏడుస్తూ కూర్చుంటే, దాతకానివాడని హేళన చేస్తుంది సమాజం. అందుకని తన భావాలని తనలోనే దాచుకుని కుమిలి పోతాడు మగాడు. పైకి చూపించనంత మాత్రాన అతనికి హృదయం లేదను కుంటుంది సమాజం. శమంతా! నువ్వు నాకు కావాలి. నీకోసం ఏ త్యాగాన్నైనా చేస్తాను.'' రుద్ధకంఠంతో అంటున్న అతని మాటలకి ఏమని సమాధానం ఇవ్వాలో తెలీక మౌనంగా ఊరుకుంది శమంత. "శమంతా! నేనంటే నీకు ఇష్టం లేదా? కనీసం అదైనా చెప్పు."

"నువ్వంటే నాకిష్టమే. కాని నీకు సునీత మీద ఇష్టం ఎందుకు పోయిందో అర్థం కావడంలేదు."

"నీ మీద ఇష్టం పెరిగింది కనుక మనసు నిన్నే కోరుకుంటోంది కనుక." చిరునవ్వుతో సమాధానం చెప్పాడు.

"రఘూ!" అరిచినట్టుగా వుంది ఆ పిలుపు. ఆమె కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి.

"ఏటి శ్యామూ ఏమన్నాను? నీ కెందుకు కోపం వచ్చింది?" కంగారు పడుతూ అడిగాడు రాఘవన్.

"రఘూ! రేపు నాకన్నా అందగత్తె తారసపడితే, నామీద ఇష్టమూ తగ్గిపోవచ్చుగా?" ఆమె గుండెల్లో కోపం జ్వాలగా ప్రజ్వరిల్లి శరీరం కంపించి పోతోంది.

"సునీత నాకు దూరమవ్వడానికి, నువ్వు దగ్గరవడానికి కారణం చెబుతాను విను. సునీతకీ, నాకూ చిన్ననాడే పెద్దలు వివాహం చేసేశారు. వారి నిర్ణయానికి నేనుకాని, సునీతకాని ఎదురు తిరగలేదు. మా ఇద్దరినీ ఒక తాటిన నడిపింది వివాహబంధం ఒక్కటేనని చెప్పాలి. మా ఇరువురి అభిరుచులు వేరు. నాకు సంగీతం, నృత్యం, హాయిగా కులాసాగా గడుపుతూ బతకడం ఇష్టం. ఆమెకి పూజలూ, పునస్కారాలు, వ్రతాలూ, ఉపవాసాలూ

ఇష్టం. నేను రమ్మన్న చోటికి ఆమెరాదు, చివరికి సినిమాలకు కూడా. ఆమె రమ్మనే భజనలకి, బాబాల దగ్గరకి నేను పోలేను అలా అని నా సంతోషానికి ఆమె అడ్డు రాలేదు. ఆమె నియమాలకి, నిష్ఠలకి నేను ఏనాడూ అడ్డు చెప్ప లేదు. ఒకరి సెంటిమెంట్స్‌ని ఒకరం అర్థం చేసుకుంటూనే, ఇద్దరు పిల్లలకి తల్లిదండ్రులమయ్యాం. కానీ శ్యామూ! నాలో నిద్రాణమైయున్న కోరికలు, నిన్ను చూడగానే పడగవిప్పిన పాములా బుసకొట్టాయి. నేను కోరుకున్నవన్నీ నీలో కనిపించేసరికి పిచ్చివాణ్ణయిపోయాను. శమంతా! నాకు తెలుసు - మగాడు ప్రేమకోసం చచ్చిపోతానంటే నవ్వుతుంది లోకం. అందులోనూ పెళ్ళయిన మగాడు ఈ మాటలంటే ఎగతాళి చేస్తుంది లోకం. చులకనగా చూస్తుంది. నువ్వులేందే నేను బ్రతుకలేను శమంతా. ఒక్కసారిగా చందమామ చేతికందొచ్చినంతగా నా మనసు పులకరించింది నిన్ను చూసి. నా వయస్సు పలకరించింది కొత్త కోరికలు దొంతులుగా పేర్చుకునొచ్చి. అణువణువూ నీ పేరుతోనే నిండిపోయింది. నీ వలపు తలపులతో, తెగని ఆలోచనలతో పిచ్చివాణ్ణయి పోతున్నాను. ఇప్పుడు చెప్పు శమంతా! నేనంటే నీకిష్టమేనా? నన్ను నొప్పిస్తున్నాననే భావన లేకుండా ఉన్నదున్నట్టు చెప్పు. నీకిష్టం లేక పోతే లేదని చెప్పు."

నీళ్ళు నిండిన కళ్ళలో శమంత కేసి చూస్తూ అన్నాడు.

"అదికాదు రఘూ! నావల్ల నీ భార్యకి, పిల్లలకి అన్యాయం జరగడం నాకిష్టంలేదు. మీ కాపురంలో నిప్పులు పోశానన్న నింద నేను భరించలేను. దయచేసి నన్నొక స్నేహితురాలిగా మాత్రమే చూడండి." ప్రాధేయపూర్వకంగా అంది శమంత.

"శ్యామూ! నీవల్ల వాళ్ళకే కొరతా రానివ్వను. వాళ్ళిప్పుడు ఎలా ఉన్నారో అలాగే వుంటారు. నాకున్న ఆస్తి చెరిసగమూ చేస్తాను-సరేనా?"

"నువ్వెంత పిచ్చివాడివి రఘూ! ఆస్తినైనా చెరిసగం చెయ్యడానికి నిస్సహాయస్థితిలో ఒప్పుకుంటుందేమో కానీ ఆడది భర్తని మరో స్త్రీతో చెరిసగం పంచుకోవడానికి చస్తే ఒప్పుకోదు."

"నేను ఒప్పిస్తాను."

"బలవంతంగానా?"

"ఎలాగో అలాగ."

"అదే నాకిష్టం లేదు."

"కొద్ది రోజులు బాధపడొచ్చును సునీత. తరువాత ఆమే అర్థం చేసుకుంటుంది. నా కోసం సునీత తప్పకుండా ఒప్పుకుంటుంది."

"కానీ 'లా' .... ఒప్పుకోవద్దూ?"

"సునీత అనుమతిస్తే 'లా' ఎందుకొప్పుకోదూ?"

"ఏమో, నాకేంచెయ్యాలో బోధపడడం లేదు. నా జీవితం ఎప్పుడూ సమస్యల వలయంగానే వుంటోంది కానీ, సాఫీగా సాగిపోవడంలేదు. "కన్నీళ్ళు చెంపలమీదుగా జారుతుంటే, రఘుకేసి చూస్తూ అంది శమంత.

జేబులోంచి రుమాలు తీసి శమంత కళ్ళు తుడిచాడు రాఘవన్. ఆ సర్పృశలో ఏదో పులకింత. మనస్సు చలించింది గిలిగింతలు పెట్టినట్టయింది. అతని చేతులను సున్నితంగా నెట్టేసింది. అతను శమంత చేతిని తన చేతిలోకి తీసుకుని గట్టిగా పట్టుకున్నాడు. శమంత రాఘవన్‌కేసి చూసింది. ఆ వెచ్చదనంలో, ఆ కళ్ళల్లో ఎన్నోకలలు, ఏవేవో కోరికలు. నాలుగు కళ్ళూ ఏకమయ్యాయి. రెండు మనసులూ పెనవేసుకున్నాయి. రాఘవన్ ఆనంద డోలికల్లో తూలిపోతున్నాడు. మేఘంలాగా శరీరం తేలిపోతుంది. ఆ మధుర క్షణం వర్ణనాతీతం. ఇరువురి కంట్లోంచి జలజలా రాలిన వెచ్చని కన్నీళ్ళు ఇద్దరి మనసులనీ చేరువ చేశాయి. అంతే. ఇద్దరూ కలిసి సినిమాలకెళ్ళారు. పిక్‌నిక్‌లకెళ్ళారు. స్నేహితుల ఇళ్ళకీ హోటళ్ళకీ, ఇలా ఎన్నో చోట్లకి.

"నలుగురూ చెవులు కొరుక్కుంటున్నారు, ఏమిటే ఇది?" శమంత తల్లీ తండ్రీ నెత్తీనోరు కొట్టుకున్నారు. రాఘవన్ ఇంట్లో కలతలు తారాస్థాయికి చేరుకున్నాయి. అందరూ ఆమెనొక దోషిలాగా చూస్తున్నారు.

"శ్యామూ! మనం కొండకెళ్ళి పెళ్ళిచేసుకునొచ్చేద్దాం. నావాళ్ళూ, నీవాళ్ళూ ఈ పెళ్ళికెవరూ వుండరు. కానీ, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీర్వచనాలతో మన పెళ్ళి జరుగుతుంది. సరేనా?" అన్నాడు రఘు. కాదనలేక పోయింది శమంత, కోరికలు గుర్రాలకన్నా వేగంగా పరుగెడుతుంటే.

ధగధగా మెరుస్తున్న మంగళసూత్రాలు గుండె మీద వేళ్లాడుతూ వుంటే, నులివెచ్చని కోరికలు మనసును మత్తెక్కిస్తూ వుంటే. అతని

కౌగిలింతలో కరిగిపోతోంది శమంత. గోడమీద వేలాడుతున్న మర్ఫీ రేడియో క్యాలండరులోని పాపాయిబొమ్మా, ఫారెక్స్ అడ్వర్‌టైజ్‌మెంట్‌ల పాపాయిల బొమ్మలూ గుర్తుకొచ్చి, శమంతకి మాతృత్వంలోని మాధుర్యం మరింత మత్తులో ముంచేసింది. "రఘూ! నాకలాంటి పాపాయి కావాలి" అంది మెల్లగా అతని చెవిలో, గోడమీద క్యాలెండర్ని చూపిస్తూ. రాఘవన్ ఈ లోకంలో లేడు. ఆ గదిలోని ప్రతి వస్తువులో అతనికి శమంతే కనబడుతోంది. తనివి తీరని తన్మయత్వంలో మునిగిపోయాడు. శమంత కౌగిట్లో నలిగిపోయాడు.

శమంత వేరే ఇల్లు తీసుకుంది. తన ఇంటిని తన అభిరుచుల కను గుణంగా ఎంతో రమణీయంగా అలంకరించుకుంది. చిన్న ఇల్లే అయినా అన్ని సదుపాయాలూ అమర్చుకుంది. ఆమె ప్రపంచం అంతా అతనితోటే పెనవేసుకు పోయినట్టు అనుభూతిని పొందుతూంది రఘుకూడా తను చేసే ప్రతి పనిలో శమంతనే చూస్తున్నాడు. తెల్లారినా, పొద్దుగూకినా ఆమెతోనే ప్రపంచం. ఆమెలోనే వెలుగు. ఆమె కొన్ని క్షణాలు కనిపించకపోతే అంతా శూన్యం.

ఏదిఏమైతేనేం? రాఘవన్ ప్రధానంగా వుండేది శమంత దగ్గరే. దాంతో అసలే పూజా పునస్కారాలతో మునిగితేలే సునీత, రాఘవన్‌కి మరింత దూరమయింది.

జీవితంలో రెండు క్యాలెండర్లు మారాయి. శమంతా రాఘవన్‌లలో మునుపటి జోరు తగ్గింది. ఉద్రేకంతో కాక ఆలోచించి పన్లుచేసే స్థితికొచ్చారు. శమంతకి పిల్లల పిచ్చి ఎక్కువయిపోయింది. ఒక రోజున తనకి పిల్లలెందుకు పుట్టడంలేదో డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళమని, పరీక్ష చేయించమని పోరుపెట్టింది. దాంతో ఆ ఇంట్లో పిడుగు పడ్డట్టయింది. భూకంపం వచ్చినంత పనయింది. శమంత గుండెల్లో చెలరేగిన తుఫాను బీభత్సాన్ని సృష్టించింది. రాఘవన్ చాలా రోజుల క్రితమే పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నాడు. ఈ పెళ్ళికి సునీత పెట్టిన ఆంక్షల్లో ఒక్కటే. రాఘవన్‌కి తిరిగి పిల్లలు పుట్టేలా ఆపరేషన్ చేయించుకోకూడదని. ఈ రెండు విషయాలూ రాఘవన్ శమంతకి చెప్పకుండా దాచాడు. ఈ విషయం మొదలే తెలిస్తే, శమంత పెళ్ళికొప్పు కోదేమోననే భయపడ్డాడు తప్ప, నిజం తెలిసినప్పుడు అంతకు రెట్టింపు బాధ పడుతుందనీ, తననొక మోసగాడుగా భావిస్తుందనీ ఊహించలేకపోయాడు.

శమంత గుండెల్లో అగ్నిపర్వతాలు బద్దలయ్యాయి, రాఘవన్ ఒక వంచకుడిగా, దోపిడీదారుగా మాత్రమే ఆమె కళ్ళముందు కనబడుతున్నాడు. రాఘవన్ ఎంత నయాన చెప్పినా ఆమెకు చెవికి సోకడంలేదు. ఒక్క త్రుటిలో ఆమె మనసు పాలు విరిగినట్టు విరిగిపోయింది. ఇరువురి మధ్యన అగాధం ఏర్పడింది. బ్రతికినంత కాలం నేనొక గొడ్రాలిగా, మోడుగా మిగిలిపోవాలి తప్ప మరో మార్గం లేదనుకునేసరికి పిచ్చిదైపోతోంది.

కాల గర్భంలో మరో ఆరు మాసాలు కలిసిపోయాయి. కాలం ఇరువురి మధ్యా స్థంభించిపోయినట్టు, శమంతా, రాఘవన్‌లు మూగగా గడుపుతున్నారు. "నేను మళ్ళీ నాట్య ప్రదర్శనలివ్వదలచుకున్నాను" అంది ఒక రోజున శమంత.

"ఇప్పుడా?" అన్నాడు రాఘవన్.

"అవును. ఇప్పుడయితేనేం?

"అంత అవసరం ఏమొచ్చిందని?"

"కాలం గడవడంలేదు కనుక."

"గడవడం, గడవక పోవడం మన చేతుల్లో వుంది"

"మన చేతుల్లోంచి జారిపోయి ఇప్పుడది నన్ను వెక్కిరిస్తోంది."

"అది నీ భ్రమ!"

"కాదు, పచ్చి నిజం! ఒక వంచకుడి చేతిలో కీలు బొమ్మగా, ఒక కాముకుడి దాహానికి ఆటబొమ్మగా జీవితాంతం గడపలేను."

రాఘవన్ మాట్లాడలేదు మళ్ళీ ఇద్దరి మధ్యా మౌనం గోడ కట్టింది.

ఆ తరువాత రాఘవన్‌కి చెప్పకుండా ఒక కళా సంస్థ ప్రదర్శిస్తున్న నృత్య నాటిక "వరూధినీ ప్రవరాఖ్యుడు"లో వరూధినిగా నటించడానికి ఒప్పుకుంది శమంత. రాఘవన్ మండిపడ్డాడు. "పెళ్ళయ్యాక ఇలా అర్ధరాత్రి దాకా రిహార్సల్సూ, ప్రదర్శనా అంటూ తిరగడం-ఎవరైనా ఏమనుకుంటారు?" అని నిలదీసి అడిగాడు.

"పిల్లా జెల్లా లేని నన్ను చూసి. మాతృత్వానికి పనికిరాననుకునే పెద్ద మనుష్యులు నవ్వుకుంటూ వుంటే నేనేమనుకోవాలి?'' సూటిగా అడిగింది శమంత. రాఘవన్ తలవంచుకున్నాడు, సమాధానం చెప్పలేక.

అంతే ఇరువురి జీవితాలూ, రైలు పట్టాల్లా సాగిపోతున్నాయి. ఈ మౌనం, ఈ వాతావరణం భరించలేని రాఘవన్ పిచ్చివాడయిపోయాడు. ఇటు శమంత మాట్లాడదు. అటు సునీతా మాట్లాడదు. రెంటికి చెడ్డ రేవడిలా, పిల్లలతోటే ఎక్కువ కాలాన్ని వినియోగిస్తూ, నెల అయ్యేసరికి శమంతకి ఇంటి ఖర్చులకయ్యే డబ్బు మాత్రం ఇస్తున్నాడు. దాంతో శమంత అహం మరీ దెబ్బతింది. డబ్బు తిప్పి పంపించేయడం మొదలు పెట్టింది. దాంతో పరిస్థితులు మరింత బెడిసికొట్టాయి.

చివరికి మెదడు సరిగ్గా ఎదగని పిల్లలకి నాట్యం నేర్పించడానికి నాట్యా చారిణిగా చేరింది. కళకు దగ్గరగా, కళంకం తెచ్చే ప్రపంచానికి దూరంగా, ఆ పిల్లలకి నాట్యాన్ని నేర్పే స్కూల్లో చేరింది.

ఇప్పుడెంతో మనశ్శాంతి. ఆ పిల్లల మధ్య ఏదో ప్రశాంతత. వారికి నృత్యాన్ని నేర్పిస్తూ, ఏదో సాధిస్తున్నానన్న తృప్తి. కొత్త ఉత్సాహం.

రేపు తానందుకోబోతూన్న గౌరవాన్ని గురించి ఎన్నో ప్రశంసలు. ఎందరివో ఆశీస్సులు. కాని ఈ తియ్యని వర్తమానం వెనుక గులాబీ చెట్టు ముళ్ళలాగా ఎంత దుఃఖం దాగి వుందో, ఎంత బాధాకరమైన గతం గూడు కట్టుకుని వుందో ఎవరికి తెలుసు? రంగుటద్దాలు కళ్ళని కప్పేస్తే, మొహం కొత్త అందంతో కనిపించినా, అద్దాలు తీసేశాక కనిపించే గుడ్డి కళ్ళు ఎంత మందిని ఆకర్షిస్తాయీ? రెండు పెళ్ళిళ్ళు చేసుకుని, ఒక్క సంసారమూ నిలువ లేదు. తప్పెవరిది? తనకే అర్థం కావడంలేదు.

పరిష్కారంలేని సమస్యలతో తలబద్దలవుతూ వుంటే, తప్పెవరిదో నిర్ణయం మనకే ఒదిలేస్తూ, నిద్రలోకి జారుకుంది శమంత. *